ఇంటింటి సర్వే ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ, ఉపాధి, కులం) కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు ఎన్యుమరేటర్లు సర్వే చేయాల్సిన ఇండ్ల గుర్తింపును ప్రారంభించారు. మరో రెండురోజుల పాటు జరిగే గుర్తింపు ప్రక్రియలో ఇండ్లకు స్టిక్కర్లు అంటిస్తారు. ఆ తర్వాత ఇంటింటికీ వెళ్లి 57ప్రశ్నలతో వివరాలు సేకరిస్తారు.

మిగతా జిల్లాల్లో 18నుంచి బహిరంగ విచారణ

హైదరాబాద్, నవంబర్6 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ నిర్ణయానికి సంబంధించి బహిరంగ విచారణను ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు తిరిగి ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ నిర్ణయించింది. రిజర్వేషన్ల స్థిరీకరణకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో బీసీ కమిషన్ బహిరంగ విచారణను నిలిపివేసింది. తాజాగా ఆయా అంశాలపై బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు బుధవారం ప్రత్యేకంగా చర్చించారు. ఈ క్రమం లో రిజర్వేషన్ల స్థిరీకరణ అంశాలపై కాకుండా వెనుకబడిన తరగతుల కులాల స్థితిగతులపై మిగిలిన ఉమ్మడి 5జిల్లాల్లో బహిరంగ విచారణ కొనసాగించాలని నిర్ణయించారు. నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లో 18 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మితో ప్రభుత్వం ఇటీవల నియమించిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు బుధవారం భేటీ అయ్యారు. బీసీ కమిషన్ చేసిన అధ్యయన వివరాలను తెలుసుకున్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ల హామీ ఏమైంది?

- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో 21 హామీల అమలు ఏ మైందని ప్రశ్నించారు. మంత్రి వర్గంలో 42 శాతం బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ చేసిన కామారెడ్డి అసెంబ్లీ సీటును కూడా బీ సీలకు ఇవ్వలేదని విమర్శించారు. కులగణనపై మాట్లాడే రాహుల్ ఏ కులమో, ఏ మతమో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ –ఈ రిజర్వేషన్లు ఎత్తేస్తామని చెప్పారు.

కులగణనకు టీచర్లను వాడొద్దు

బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): కులగణన కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించడం, 30 వరకు ఒక్కపూట బడులు నిర్వహించడం తగదని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. 'కులగణన కోసం ఒక్క పూట మాత్రమే బడులు పెడుతారా? అది కూడా మూడు వారాలపాటు! మీ పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటారా?' అని బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఒక్కరోజులోనే రాష్ట్రమంతా సమగ్ర కుటుంబ సర్వే చేశారని, గుర్తు చేశారు.

ఎస్సీ వర్గీకరణ చేయకపోతే సర్కారుతో యుద్ధమే



బడంగ్‌పేట్, నవంబర్ 6 : ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోతే రేవంత్ సర్కార్‌పై యుద్ధం చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా మాదిగల ధర్మయుద్ధ మహాసభను తుక్కుగూడలోని కళాశ్రీ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణమాదిగ మాట్లాడుతూ డిసెంబర్ 21న హైదరాబాద్‌లో ధర్మయుద్ధం మహాప్రదర్శన చేపట్టి రేవంత్‌రెడ్డితో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు.

నిద్రమత్తు వీడండి.. మరమ్మతులు చేయండి

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): రోడ్ల మరమ్మతు విషయంలో నిద్రమత్తు వీడాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు మీరు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నా రా? అంటూ బుధవారం జరిగిన సమావేశంలో అధికారులపై విరుచుకుపడ్డారు.

మంత్రికి మేలు.. ఖజానాకు చిల్లు

- దక్షిణ డిస్కం అధికారుల పక్కాస్కెచ్
- వేలాది మంది చిన్న కాంట్రాక్టర్ల నోర్లుకొట్టి బడా కాంట్రాక్టర్‌కు మేలు
- 20 శాతం అంచనాలు పెంచి గ్లోబల్ టెండర్లకు రంగం సిద్ధం
- విద్యుత్ శాఖ స్టోర్స్ నుంచి మెటీరియల్ సరఫరాకు స్వస్తి
- గత రెండు నెలల్లో పిలిచిన 38 పనుల టెండర్లు రద్దు
- ఉపాధి కోల్పోనున్న కాంట్రాక్టర్లు, కార్మికులు

గతంలో ఇలా..

ఒక సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలంటే ముందుగా దానికి అధికారులు టెండర్లు పిలుస్తారు. పదుల సంఖ్యలో కాంట్రాక్టర్లు పోటీపడితే తమకు కాస్తోకూస్తో గిట్టుబాటయ్యేలా ఒకరు పని దక్కించుకుంటారు. దక్షిణ డిస్కం తమ స్టోర్ నుంచి మెటీరియల్‌ను సరఫరా చేస్తుంది. కాంట్రాక్టర్లు కేవలం వాటిని వినియోగించుకొని సబ్ స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేస్తారు. ఇందులో ఒక్కో కాంట్రాక్టరు కింద కనీసంగా 12–20 మంది వరకు కార్మికులు పని చేస్తారు.

ఈ విధానంతో ప్రయోజనాలు...

కాంట్రాక్టర్ల ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. డిస్కమే మెటీరియల్‌ను కొనుగోలు చేస్తుంది. తద్వారా నాణ్యత పకడ్బందీగా ఉండటంతో పాటు ధర కాస్త తక్కువగా ఉండి, సర్కారు ఖజానాకు ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రస్తుతం ఇలా..

డిస్కం పరిధిలో ప్రతిపాదించిన అన్ని సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఒకే నోటిఫికేషన్‌లో టెండర్లు పిలిచేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందులో మెటీరియల్‌తో సహా అంచనాల వ్యయాలు రూపొందించారు. అంటే కాంట్రాక్టరే మెటీరియల్‌ను సమకూరుస్తాడు.

ఈ విధానంతో నష్టం...

గ్లోబల్ టెండర్లు పిలవడం వల్ల అంచనా వ్యయం రూ.వందల కోట్లలో ఉంటుంది. బడా కంపెనీలు తప్ప చిన్న కాంట్రాక్టర్లు పాల్గొనేందుకు అవకాశమే ఉండదు. తద్వారా వేలాది కాంట్రాక్టర్లకు ఉపాధి పోయి.. వారి కుటుంబాలు ఆర్థిక చిక్కుల్లో పడిపోతాయి.

–మెటీరియల్‌కు అయ్యే మొత్తాన్ని కాంట్రాక్టరుకు డిస్కం చెల్లించాలి. మార్కెట్‌లో తక్కువ ధరకు కొని ప్రభుత్వం నుంచి మాత్రం ఎక్కువ ధరను కాంట్రాక్టరు పొందుతాడు. నాణ్యతాలోపం ఉంటుంది.

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఒక మంత్రి కోసం వేలాది కాంట్రాక్టర్ల పొట్టకొట్టడంతో పాటు సర్కారు ఖజానాకు చిల్లు పడేలా కొత్త విధానాన్ని తీసుకొచ్చేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రణాళిక రూపొందించింది. ఇదే విషయాన్ని 'నమస్తే తెలంగాణ' కొన్ని రోజుల కిందటే వెలుగులోకి తెచ్చింది. సదరు మంత్రికి చెందిన ఇన్‌ఫ్రాకు ఏపీలో వచ్చిన కాంట్రాక్టు రద్దు కావడంతో అప్పటికే ఆ సంస్థ కొనుగోలు చేసిన సబ్‌స్టేషన్ల మెటీరియల్ అంతా నిరుపయోగంగా మారింది. దానిని వదిలించుకునేందుకు దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రం నుంచి వస్తున్న కాంట్రాక్టు విధానాన్ని మార్చి గ్లోబల్ టెండర్ ద్వారా ఆ మంత్రి కంపెనీకి పనులు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. దీంతో వేలాది మంది కాంట్రాక్టర్లు, వారి కింద పనిచేసే కార్మికులు వీధినపడే అవకాశం ఉంది. ఇప్పటికే గత సెప్టెంబర్,అక్టోబర్ నెలల్లో సర్కిళ్ల వారీగా పిలిచిన సుమారు 38కి పైగా పనులకు సంబంధించిన టెండర్లను ఆకస్మాత్తుగా రద్దు చేశారు. ఇలాంటి టెండర్లు దక్షిణ డిస్కం పరిధిలో సుమారు 240 వరకు ఉంటాయి. వాటన్నింటినీ

గంపగుత్తగా ఒకే కాంట్రాక్టర్‌కు గ్లోబల్ టెండర్ల విధానం ద్వారా అప్పగించేలా ఉన్నతాధికారులు హడావుడిగా టెండర్లను సిద్ధం చేస్తున్నారు.

20 శాతం అంచనా పెంచి గ్లోబల్ టెండర్...

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనే కాదు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ విద్యుత్ సంస్థల్లో చేపట్టే పనులను సంస్థలో నమోదిత కాంట్రాక్టర్లకు మాత్రమే అప్పగించే సంప్రదాయం ఉంది. దానికి తిలోదకాలు ఇచ్చి గ్లోబల్ టెండర్లకు శ్రీకారం చుట్టారు. వేలాదిమంది విద్యుత్ కాంట్రాక్టర్లు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నా లెక్కచేయకుండా ఓ మంత్రి కంపెనీకి మేలు చేసేందుకే తెరపైకి గ్లోబల్ టెండర్ల అంశాన్ని తెచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక కాంట్రాక్టర్లకు అప్పగించేలా టెండర్లు పిలిస్తే పోటీపడి 10–15 శాతం తక్కువకే పనులు చేసే కాంట్రాక్టర్లు వందల్లో కాదు వేలల్లో ఉన్నారు. అలాంటి వారిని కాదని 20 శాతం అంచనా వ్యయాన్ని పెంచి ఓ మంత్రి కంపెనీకి అప్పగించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే సుమారు 72 సబ్ స్టేషన్ల నిర్మించాల్సి ఉండగా, మిగతా డిస్కం పరిధిలో కలిపి 240కి పైగా సబ్ స్టేషన్లు నిర్మించాలని నిర్ణయించారు. వీటన్నింటినీ ఒకేసారి గ్లోబల్ టెండర్ల ద్వారా ఒకే కంపెనీకి ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాష్ట్రంలో 4500 మంది విద్యుత్ కాంట్రాక్టర్లు ఉన్నారు. ఇక గ్లోబల్ ఓపెన్ టెండర్ విధానంలో విద్యుత్ శాఖ అధికారులు పార్షియల్(పాక్షికంగా)టర్న్‌కీ విధానాన్ని తీసుకువస్తున్నారు. ఈ విధానం ద్వారా సామగ్రిని డిస్కంకు బదులు కాంట్రాక్టర్లే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత వారికి డిస్కం నుంచి బిల్లులు అందుతాయి. తద్వారా ఖజానాకు చిల్లు పడడంతో పాటు నాణ్యత లోపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన విద్యుత్ కాంట్రాక్టర్లు

గ్లోబల్ టెండర్ల విధానాన్ని అమలు చేయవద్దంటూ టీజీఎస్‌పీడీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, ఎం.ఎన్.రెడ్డి సీఎండీ ముషారఫ్ ఫారూఖీకి పలుమార్లు వినతిపత్రం అందజేశారు. అయినా ఎటువంటి స్పందన లేకపోవడంతో 20 రోజుల క్రితం ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను సైతం కలిశారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి వారం రోజుల్లో సమాచారం ఇస్తానని ఆయన చెప్పారు. వారాలు గడిచినా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం రాలేదు. మరోవైపు గ్లోబల్ టెండర్లను రూపొందించే పనిలో డిస్కం ఉన్నతాధికారులు ఉన్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఈ విధానం అమలైతే తమ జీవితాలు రోడ్డున పడినట్టేనని వారంతా ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కులసర్వే తర్వాతే రిజర్వేషన్ల పెంపు

రేషన్ కార్డు, ఇల్లు ప్రామాణికం కాదు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): సమగ్ర కుటుంబ సర్వే ఫలితాల ఆధారంగా రిజర్వేషన్ల పెంపుపై చర్చిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రజాభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బుధవారం నుంచి ఇండ్ల జాబితాను తయారు చేస్తారని, ఇంటి నంబరు, కుటుంబ యజమాని పేర్లతో కూడిన స్టిక్కర్లను అందజేస్తారని తెలిపారు. 9వ తేదీ నుంచి సర్వే మొదలవుతుందని చెప్పారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌బుక్‌లు వంటివి అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కుటుంబ నిర్ధారణకు రేషన్‌కార్డుగానీ, ఇల్లుగానీ ప్రామాణికం కాదని చెప్పారు. ఒకే ఇంట్లో ఒకటి కన్నా ఎక్కువ కుటుంబాలు ఉండొచ్చని, గతంలో ఒకే రేషన్ కార్డులో పేర్లు నమోదైనా ఇప్పుడు వేర్వేరు కుటుంబాలుగా కూడా ఉండొచ్చని తెలిపారు. అలాంటివారు విడివిడిగానే నమోదు చేసుకోవాలని కోరారు.

బీసీ బిల్లు పెట్టకపోతే అగ్గిరాజేస్తాం

బీజేపీ, కాంగ్రెస్ భరతం పడతాం: ఆర్ కృష్ణయ్య

రవీంద్రభారతి, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని అన్నారు. బిల్లుకు అన్ని రాజకీయపార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి, అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఓబీసీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయాలని కోరారు. లేకపోతే బీజేపీ సర్కారుపై తిరుగుబాటు తప్పదని, అన్ని పార్టీతో కలసి పార్లమెంట్‌ను స్తంభింపచేస్తామని తేల్చిచెప్పారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆర్ కృష్ణ య్య మాట్లాడుతూ కులగణనపై మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ 60 ఏళ్ల పాలనలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు కల్పించలేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఇప్పటికైనా బీసీ బిల్లు, కులగణన కోసం కేంద్రంపై కాంగ్రెస్ ఒత్తిడి పెంచాలని, లేకపోతే దేశవ్యాప్తంగా అగ్గిరాజేస్తామని హెచ్చరించారు. సానుకూలంగా స్పందించకపోతే బీజేపీ, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో ప్రచారం చేస్తామని చెప్పారు.

ఇంటింటి సర్వే చెల్లుతదా?

మొదటిపేజీ తరువాయి...

అవకాశమే లేదని కొందరు చెప్తుండగా, చెల్లుబాటైనా ఆ నివేదికను గోప్యంగా ఉంచక తప్పదని మరికొందరు తేల్చిచెప్తున్నారు.

న్యాయపరమైన చిక్కులెన్నో..

వాస్తవానికి జనాభా గణన, సర్వే రెండూ వేర్వేరు. జనాభాగణన అంటే మొత్తం ప్రజల సమస్త సమాచారాన్ని సేకరించడం. సర్వే అనేది నిర్దేశిత లక్ష్యాలతో ఏదైనా ఒక అంశానికి సంబంధించి, మొత్తం జనాభాలో కొంతమందిని శాంపిల్‌గా ఎంపిక చేసుకుని నిర్వహించేది. అందుకు సంబంధించి దేశంలో రెండు రకాల చట్టాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. జనాభాగణన అంశం అనేది 7వ షెడ్యూల్‌లో కేంద్ర జాబితాలోని అంశం. 1948 చట్టం ప్రకారం జనగణన చేపట్టే అధికారం కేవలం కేంద్రానికి మాత్రమే ఉన్నది. ఎలాంటి జనగణన అయినా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాల్లేవు. ఒకవేళ చేసినా ఆ గణాంకాలకు చట్టబద్ధత ఉండకపోవడమేగాక, అమలు చేసే అవకాశం కూడా లేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వమే గణాంకాల సేకరణ చట్టం 2008 ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు డేటా సేకరణకు కొన్ని పరిమిత అధికారాలను బదలాయించింది. నిర్దేశిత అంశానికి సంబంధించి గణాంకాలను సేకరించే అధికారాన్ని రాష్ట్రాలతోపాటు, కేంద్రపాలిత ప్రాంతాలకు, అటు తరువాత పంచాయతీలు, మున్సిపాలిటీలకు సైతం కల్పించింది. అదే సమయంలో కొన్ని షరతులనూ విధించింది. 2017లో ఈ చట్టానికి మరిన్ని సవరణలు చేశారు. 2008 చట్టం ద్వారా 7వ జాబితాలోని జనాభాగణనను నిర్వహించకూడదు. ఆ పరిధిలోకి రాదు. ఒకవేళ రాష్ట్రం నిర్వహించాలని భావించినా.. అందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. అంతేకాదు సేకరించిన డేటా వెల్లడిపైనా అనేక ఆంక్షలను విధించింది.

చట్టాలకు విరుద్ధంగా నిర్వహణ

రాష్ట్ర ప్రభుత్వం పేరుకు ఇంటింటి సర్వే అని చెప్తున్నా.. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జనాభాగణననే నిర్వహిస్తున్నదని మేధావివర్గం వివరిస్తున్నది. గణాంకాల సేకరణ చట్టం–2008 ప్రకారం సర్వే నిర్వహించాలన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నోడల్ అధికారులను నియమించాల్సి ఉంటుంది. సదరు అధికారులు కేంద్రం ఆధీనంలోనే పనిచేయాల్సి ఉంటుంది. అంతేకాదు నిర్వహించతలపెట్టిన సర్వేకు సంబంధించిన నిబంధనలను కూడా పూర్తిగా కేంద్రమే నిర్ణయించాల్సి ఉంటుంది. నిపుణుల కమిటీ ద్వారా సర్వేకు సంబంధించిన ప్రశ్నావళిని సైతం కేంద్రమే రూపొందించాలి. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా సర్వేను నిర్వహిస్తున్నది. రాష్ట్రంలో ప్రస్తుతం చేపట్టిన సర్వే ఎందుకోసం?, ప్రజలకు ఏ ప్రయోజనం కలుగుతుంది? అనే అంశాలపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎక్కడా స్పష్టంగా చెప్పలేదు. జీవోల్లోనూ పేర్కొనలేదు. అంతేకాదు చట్టంలో నిర్దేశించినవిధంగా ప్రభుత్వం ఇప్పటివరకు ఏ ఒక్క నోడల్ అధికారినీ నియమించలేదు. నిపుణుల కమిటీని కూడా నియమించలేదు. ఇవేవీ చేయకుండానే కేవలం ప్రణాళికశాఖను నోడల్ ఏజెన్సీగా పెట్టి, వారితోనే ప్రశ్నావళిని రూపకల్పన చేయించి సర్వేను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహింపజేస్తున్నదని తెలంగాణ మేధావివర్గం, న్యాయకోవిదులు చెప్తున్నారు. అంతిమంగా సర్వే న్యాయస్థానాల ఎదుట చెల్లుబాటు కావడం కష్టమేనని వారు స్పష్టంచేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే గతంలో 2014లో కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే తరహాలోనే నివేదిక గోప్యంగానే ఉంచకతప్పదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నాడు కుటుంబ సర్వేపై న్యాయస్థానాల్లో అనేక పిటిషన్లు దాఖలయ్యాయయని, ఈ నేపథ్యంలోనే ఆ నివేదికలను వెల్లడించలేదని గుర్తుచేస్తున్నారు. అదీగాక బీహార్ చేపట్టిన కులగణన సర్వేకు సంబంధించి కూడా ఇంతవరకు వివరాలు బహిర్గతం కాలేదు. వీటిని ఉదహరిస్తున్న బీసీ మేధావులు తాజా సర్వేపై సందేహాలు వ్యక్తంచేస్తున్నారు.

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారంలో గొడవ పడుతున్న కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

రచ్చకెక్కిన కాంగ్రెస్ నేతల విభేదాలు

- ఎమ్మెల్యే వివేక్ ఎదుటే నాయకుల బాహాబాహీ
- అసహనంతో వెనుదిరిగి వెళ్లిపోయిన ఎమ్మెల్యే

జైపూర్, నవంబర్ 6: చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతల విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. బుధవారం జైపూర్ మండలం ఇందారంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్ ముందే కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగి కొట్టుకున్నంత పనిచేశారు. ఎమ్మెల్యే కార్యక్రమానికి కార్యకర్తలు ఎవరూ రాలేదనే చర్చ జరుగుతుండగా.. ఇందారం మాజీ సర్పంచ్ జక్కుల వెంకటేశం కల్పించుకుని 'కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్‌ఖాన్ నాయకులు, కార్యకర్తలెవరికీ సమాచారం ఇవ్వకుండానే ఎమ్మెల్యేను కార్యక్రమానికి ఆహ్వానించారు' అని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఫయాజ్ స్పందిస్తూ.. 'నాపై ఉన్న వ్యక్తిగత కక్షతో.. కార్యక్రమాన్ని ఫెయిల్ చేద్దామని గొడవ సృష్టిస్తున్నారు. ఎమ్మెల్యే కార్యక్రమం ఉంటుందని నేను ప్రతి ఒక్కరికీ వాట్సాప్‌లో, పర్సనల్‌గా మెసేజ్ చేశాను' అని తెలిపారు. ఈ విషయంలో ఇద్దరు నేతలు పరస్పరం తిట్టుకున్నారు. 'ఇసుక దొంగతనాలు నువ్వు చేస్తున్నావంటే నువ్వు చేస్తున్నావు' అని ఆరోపించుకున్నారు. ఒకానొక దశలో ఇద్దరు కొట్టుకునే వరకు వెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వివేక్ తీవ్రమైన అసహనానికి గురయ్యారు. ఎస్సీ కాలనీలో మరో కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ గొడవ జరిగినప్పుడు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ కూడా అక్కడే ఉన్నారు.

హైడ్రాపై బ్యాంకర్లు భయపడొద్దు

- ఇండ్లకు అనుమతులు హైడ్రా ఇవ్వదు
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో హైడ్రా ఇండ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయదని, దాని గురించి బ్యాంకర్లు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ, టౌన్‌ప్లానింగ్ వంటి ప్రభుత్వ విభాగాలు అన్ని అంశాలు పరిశీలించి నిర్మాణాలకు అనుమతులు ఇస్తాయని వివరించారు. హైడ్రా సెక్యూరిటీ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కులు, సరస్సులు ఆక్రమణలు కాకుండా చూస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె రామకృష్ణారావు, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ టీకే శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ సర్కార్ 'మందు'చూపు

మొదటిపేజీ తరువాయి...

పెంచాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ భారం పూర్తిగా వినియోగదారులపైనే పడనున్నది. తొమ్మిదన్నరేండ్ల పాలనలో కేవలం రెండుసార్లు మాత్రమే మద్యం ధరలను సవరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ఓసారి పలు బ్రాండ్ల ధరలను తగ్గించింది. 2023 ధరలు పెంచాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ వల్ల ఆ నిర్ణయం వాయిదా పడింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. సంక్షేమ పథకాల అమలుకు డబ్బులు లేకపోవడంతో మద్యం ధరల పెంపుపైనే ఆధారపడింది.

ఒక్కో కేసుకు రూ.450 డిమాండ్

తెలంగాణలోని 6 బ్రూవరీల్లో ఏటా 88 కోట్ల లీటర్ల బీరు ఉత్పత్తి అవుతున్నది. ఆ బీరును తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ కొనుగోలుచేసి మద్యం దుకాణాలకు సరఫరా చేస్తున్నది. 12 లైట్ బీర్లు ఉండే ఓ కేసుకు రూ.289, స్ట్రాంగ్ బీర్ల కేసుకు రూ.313 చొప్పున చెల్లిస్తున్న బేవరేజెస్ కార్పొరేషన్.. నిర్వహణ ఖర్చులు కలుపుకొని ఒక్కో కేసును రూ.1,400 చొప్పున మద్యం దుకాణాలకు విక్రయిస్తున్నది. దీంతో మద్యం వ్యాపారులు ఇతర ఖర్చులన్నీ కలిపి ఒక్కో కేసును రూ.1,800 చొప్పున అమ్ముకుంటున్నారు. తయారీ కేంద్రాల వద్ద సుమారు రూ.24కి లభించే బీరు బాటిల్.. బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి మద్యం దుకాణాలకు వచ్చేసరి రూ.117, వినియోగదారులకు వచ్చేసరికి రూ.150 ధర పలుకుతున్నది. అయితే, రాష్ట్రంలో 2021 తర్వాత మద్యం ధరలు పెరగలేదని, ప్రస్తుతం ముడిసరుకు ధరలతో పాటు తమ నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగినందున కనీసం 20–25% మేరకు ధరలు పెంచాలని అన్ని బ్రూవరీలు ఎక్సైజ్ కమిటీని డిమాండ్ చేశాయి. అనంతరం ఒక్కో బ్రూవరీ ప్రతినిధులను పిలిచి విడివిడిగా మాట్లాడగా.. పెరిగిన నిర్వహణ ఖర్చుల దృష్ట్యా ఒక్కో కేసు ధరను కనీసం రూ.450 పెంచాలని కమిటీని కోరారు. దీంతో బ్రూవరీలు అడిగినంత కాకపోయినా కనీసం 10–15 శాతం మేరకు పెంచేందుకు సిద్ధమైన బేవరేజెస్ కార్పొరేషన్.. ఆ ఖర్చును పూడ్చుకునేందుకు వినియోగదారులపై అదనంగా 20–25 శాతం మేరకు భారాన్ని మోపనున్నది.

ధరల పెంపునకు కసరత్తు పూర్తి

మద్యం ధరలు ఎంత పెంచాలన్న దానిపై ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్టు తెలిసింది. ప్రజా సంక్షేమ పథకాల అమలుకు డబ్బులు లేకపోవడంతో ఆదాయం పెంపు మార్గాలపై దృష్టిసారించాలని ప్రభుత్వం ఇప్పటికే వివిధ శాఖలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఇటీవల జరిగిన రెవెన్యూ మీటింగ్‌లో మద్యం ధరల పెంపు ప్రస్తావన తీసుకొచ్చినట్టు తెలిసింది. పెరిగిన ధరలను డిసెంబర్ రెండో వారం లేదా మూడో వారంలో అమల్లోకి తీసుకురానున్నట్టు విశ్వసనీయ సమాచారం. మొత్తానికి ఈ ధరల పెంపుతో రాష్ట్ర ఖజానాకు అదనంగా రూ.7 వేల కోట్ల వరకు ఆదాయం రానున్నది.

నిలిచిన మద్యం సరఫరా

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఎక్సైజ్‌శాఖ సాఫ్ట్‌వేర్ రెండ్రోజులుగా మొరాయిస్తున్నది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 19 డిపోల నుంచి దుకాణాలకు వెళ్లాల్సిన మద్యం సరఫరా నిలిచిపోయింది. రెండ్రోజులుగా 'సీటెల్' ప్రతినిధులు రంగంలోకి దిగి సమస్యను చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో చేసేది లేక మ్యానువల్‌గా మద్యం సరఫరా చేస్తున్నారు. అయితే, ఇప్పటికే ఎంతోమంది వందల కోట్ల మద్యానికి డీడీలు సైతం కట్టారు. మంగళవారం సాయంత్రానికే సమస్య పరిష్కారమవుతుందని భావించినా.. నిపుణులు చేతులెత్తేయడంతో బుధవారం కూడా కొలిక్కిరాలేదు. గురువారం కూడా ఇదే పరిస్థితి ఉంటే.. మరిన్ని ఇబ్బందులు తలెత్తవచ్చని ఎక్సైజ్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

రేవంత్ ఎర.. బీజేపీకి చెర

మొదటిపేజీ తరువాయి...

పరిణామాలను పరిశీలిస్తే బీజేపీ సహకారం స్పష్టంగా కనిపిస్తున్నదని, కేంద్ర ప్రభుత్వ పెద్దలతో పరిచయాలను కూడా వాడుకుంటున్నారనే చర్చ నడుస్తున్నది. బీజేపీ నేతలు ధాన్యం కొనుగోళ్లలో కుంభకోణం జరిగిందంటూ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని, బిల్లుల మంజూరుకు కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ భట్టి విక్రమార్కను మాత్రమే టార్గెట్ చేశారని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. వివిధ శాఖల్లోని అవినీతిని ప్రభుత్వ అవినీతిగా చూపించి, ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాల్సింది పోయి కేవలం మంత్రుల వ్యక్తిగత అవినీతిగా చిత్రీకరించడం వెనుక మర్మమేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మూసీ ప్రాజెక్టు, హైడ్రా మీద కూడా పార్టీ ఒక పాలసీ ప్రకారం వెళ్లకపోవడం కూడా రేవంత్ వ్యూహంలో భాగమేనా? అనే అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. హైడ్రాకు అనుకూలంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడితే, కూల్చివేతలను అడ్డుకుంటామని ఎంపీ ఈటల రాజేందర్ విరుద్ధ ప్రకటనలు చేశారని గుర్తు చేస్తున్నారు. మూసీ కూల్చివేతల విషయంలోనూ ఇలా గే ఒక పద్ధతి లేకుండా 'మేము ప్రాజెక్టుకు అ నుకూలమే.. కానీ పేదల ఇండ్లు కూలగొడితే చూస్తూ ఊరుకోం' అంటూ డొంకతిరుగుడు ప్రకటనలతో ప్రజల్లో చులకన అయ్యామని సీనియర్ బీజేపీ నేతలు వాపోతున్నారు. ఇప్పు డు బీజేపీకి అత్యంత సన్నిహితుడైన ఆదానీకి చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని నల్లగొండలో మూసీ నది ఒడ్డున ఏర్పాటు చేసేందుకు రేవంత్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం కూడా బీజేపీ నోటికి తాళం వేసినట్టయిందని వాపోతున్నారు. కొన్నాళ్లుగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యవహార శైలి కూ డా విచిత్రంగా కనిపిస్తున్నదని అంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి సమస్య ఎదురైనప్పుడు, ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చినప్పుడు బండి సంజయ్ రంగంలోకి దిగి, బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేస్తూ విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నాడని చర్చించుకుంటున్నా రు. పార్టీలో కిషన్‌రెడ్డికి, ఇతర నేతలకు మధ్య ఉన్న విభేదాలను రేవంత్‌రెడ్డి తన అవసరాల కు వాడుకుంటున్నారన్న వాదనలు కూడా వస్తున్నాయి.

కేంద్రంతో సన్నిహిత సంబంధాలు

సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారని బీజేపీ సీనియర్ నేతలు చర్చించుకుంటున్నారు. ప్రధానిని బడేభాయ్ అని సంబోధించడం, కేంద్ర మంత్రుల పర్యటనల సమయంలో సంప్రదాయానికి భిన్నంగా ఆహ్వానాలు పలకడం వంటివన్నీ ఇందులో భాగమేనని చెప్పుకొంటున్నారు. కాంగ్రెస్ అలవిగాని హామీలిచ్చి అమలు చేయడంలో విఫలమవుతున్నదని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో వెనుకబడిందని విమర్శిస్తూ ప్రధాని మోదీ ఈ నెల 1న ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పాలిత తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అభివృద్ధి కనిపించడం లేదని, ఆర్థిక విపత్తు దిశగా సాగుతున్నాయని విమర్శించారు. కానీ.. వెంటనే ఆ ట్వీట్లను డిలీట్ చేశారు. రేవంత్‌రెడ్డితో సాన్నిహిత్యం వల్లే ఇలా చేశారనే ప్రచారం సాగుతున్నది. మరోవైపు రేవంత్‌రెడ్డి కోరినప్పుడల్లా ఢిల్లీలో ప్రధాని, కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లు దొరుకుతున్నాయని, వాస్తవానికి కొన్నాళ్లుగా రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్ఠానమే పక్కనబెట్టిందని, ఆయనకు పెద్దగా సమయం ఇవ్వడంలేదని, కానీ బీజేపీ పెద్దలు మాత్రం గంటలపాటు సమావేశమవుతున్నారని చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో తన ప్రత్యర్థి అయిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఈడీ దాడులు జరగడం, ఇది సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం కావడం ఈ పరిచయాల్లో భాగమేనన్న చర్చ కూడా విపరీతంగా జరుగుతున్నది. తన ప్రత్యర్థులను ఇరికించేందుకు కొందరు ఐఏఎస్ అధికారులపైనా కేంద్ర నిఘా సంస్థలకు సమాచారం ఇచ్చారని ఆరోపిస్తున్నారు. ఇలా కేంద్రంతో తన కున్న సంబంధాలను ప్రాజెక్ట్ చేసుకుంటూ రాష్ట్ర నేతల్లో గందరగోళం సృష్టిస్తున్నారనే మాటలు కూడా వినిపిస్తున్నాయి.

ఎందుకీ మెతకవైఖరి?

సాధారణంగా హిందూత్వం, ఆలయాలకు సంబంధించిన అంశాల్లో బీజేపీ, అనుబంధ సంఘాలు తీవ్రంగా స్పందిస్తుంటాయి. కానీ.. ఇటీవల తెలంగాణలో వరుసగా ఆలయాలపై దాడులు జరుగుతున్నా ఎందుకు పెద్దగా స్పందించడం లేదని సంఘ్ నేతలే అనుమానిస్తున్నట్టు తెలిసింది. సికింద్రాబాద్ ఘటన నుంచి మొదలు అనేక అంశాలు తెరమీదికొచ్చినా.. స్థానికంగా ర్యాలీలు, ఆందోళనలు తప్ప పెద్దగా పట్టించుకుంటున్నట్టు కనిపించడం లేదని సీనియర్ నేతలు భావిస్తున్నట్టు తెలిసింది. కర్ణాటక, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో మాదిరిగా ఇక్కడ ఎందుకు దూకుడుగా లేరన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ఎజెండా ఎత్తుకున్నదే ప్రధాని మోదీ అని, మందకృష్ణ మాదిగ నిర్వహించిన సభకు కూడా మోదీ వచ్చారని గుర్తుచేస్తున్నారు. కానీ.. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని బీజేపీ పెద్దగా ఒత్తిడి తేలేదని విశ్లేషిస్తున్నారు. పైగా రాష్ట్ర ప్రభుత్వంపై మందకృష్ణ మాదిగ పోరాడుతుంటే భుజం కలపాల్సిందిపోయి బీజేపీ ఎందుకు మౌనంగా ఉంటున్నదని ప్రశ్నిస్తున్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు దూకుడుగా వ్యవహరించిన నేతల ముందరి కాళ్లకు ఇప్పుడు బంధం వేశారన్న చర్చ కూడా సాగుతున్నది. ఇందుకు ధర్మపురి అర్వింద్‌ను ఉదాహరణగా చూపుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఆయనతో హైదరాబాద్, ఢిల్లీలో ప్రెస్‌మీట్లు పెట్టించి, విమర్శలు చేయించారని, ఇప్పుడు మాత్రం నిజామాబాద్‌కే పరిమితం చేశారని విశ్లేషిస్తున్నారు. .

బీజేపీకి ఏం లాభం?

సాధారణంగా ప్రభుత్వం ఓవైపు, ప్రతిపక్షాలు మరోవైపు ఉండి పనిచేస్తాయని, అంశాల ఆధారంగా ప్రతిపక్షాలు కలిసి పనిచేస్తుంటాయని, ఇక్కడ మాత్రం పరిస్థితి భిన్నంగా ఉన్నదని చెప్తున్నారు. 'రేవంత్‌రెడ్డి మన వేలితో మన కంటినే పొడుస్తున్నాడు' అని సంఘ్ నేతలు చర్చించుకుంటున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ ఎదగడం జాతీయంగా బీజేపీకి నష్టం. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఇది స్పష్టంగా కనిపించింది. కాబట్టి కాంగ్రెస్ మీద వీలైనంత ప్రజా వ్యతిరేకత పెంచేలా బీజేపీ వ్యవహరించాల్సి ఉంటుందని, కానీ ఇక్కడ భిన్నంగా ప్రవర్తిస్తుండటంతో క్యాడర్‌లోనూ ఆందోళన నెలకొన్నదని చెప్పుకొంటున్నారు. రేవంత్ గేమ్‌ప్లాన్‌లో బీజేపీ ఎందుకు భాగం కావాలని చర్చించుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి రాజకీయంగా మైలేజీతోపాటు అదనపు ప్రయోజనాలు పొందుతున్నారని చెప్తున్నారు. అటు రాజకీయంగా కలిసిరాక, ఇటు ఇతర ప్రయోజనాలు అందక బీజేపీ రెంటికీ చెడ్డ రేవడిలా మారిందని నిట్టూరుస్తున్నారు. ఈ వ్యవహారశైలిపై బీజేపీలోని కొందరు నేతలు విసుగు చెందుతున్నారని, తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని అంటున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ రాష్ట్ర అధిష్ఠానానికి చురకలంటించారని చెప్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలిచినా, అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు అధికారంలోకి రాలేకపోయామో ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారని గుర్తుచేస్తున్నారు.